ముషీరాబాద్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం

- బీజేపీ నాయకుల అరెస్ట్
- ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ నాయకుల ధర్నా

ముషీరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : దేశ ప్రతిష్టను, సైనికులను కించపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో శనివారం ముషీరాబాద్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే తపనతో సీఎం రేవంత్‌రెడ్డి దేశప్రతిష్టను, సైనికులను కించపరిచేలా మాట్లాడారని భరత్‌గౌడ్ ఆరోపించారు. వెంటనే దేశ ప్రజలకు, సైనికులకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ చౌరస్తాలో బీజేపీ జెండాలు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుకు అటు వైపు ముషీరాబాద్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు ఆయూష్, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేయసాగారు. బీజేపీ నాయకులు రోడ్డుకు అటు వైపు వెళ్లి దహనం అవుతున్న దిష్టిబొమ్మ వద్ద నినాదాలు చేస్తుండగా పోలీసులు వచ్చి దిష్టిబొమ్మ మంటలు ఆర్పేందుకు యత్నించారు. ఆయూష్‌ను బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి అటుగా వస్తున్న ఆటోలో ఎక్కించేందుకు యత్నించారు. అక్కడే ఉన్న బీజేపీ నేతలు అరెస్టును అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీజేపీ నాయకుల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. పోలీసులు బలవంతంగా ఆటోను ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఆయూష్‌ను స్టేషన్‌లో పెట్టారు. ఆటో వెంట పరుగులు తీసిన బీజేపీ నాయకులు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి అరెస్టు చేసిన ఆయూష్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టేషన్ ఎదుట బైఠాయించి పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండడంతో పోలీసులు ఒక్కొక్కరిని అరెస్టు చేసి స్టేషన్‌లోకి తీసుకెళ్లారు. దీనితో భరత్‌గౌడ్ నేతలతో కలిసి స్టేషన్ ఎదుట రోడ్డుపైనే పడుకొని నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేసిన వారిని బయటకు పంపించడంతో గొడవ సద్దుమనిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, కార్పొరేటర్ రవిచారి, బీజేవైఎం కన్వీనర్, కోకన్వీనర్లు గడ్డం నవీన్, సురేష్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుషాల్‌గౌడ్, బొల్లంపల్లి రాంరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు, మహిళామోర్చా అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, మెట్టు వాసు, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, భోలక్‌పూర్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, సాయికృష్ణయాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి బబ్లూ పాల్గొన్నారు.


ముషీరాబాద్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు భరత్‌గౌడ్, రమేష్‌రాం


ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు


మంత్రి అజారుద్దీన్‌ను సన్మానిస్తున్న మసూద్, జఫీర్ ఉద్దీన్, అక్బర్‌అలీ

మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం : అజారుద్దీన్

ముషీరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మసూద్ ఆధ్వర్యంలో అజారుద్దీన్‌ను కలిసి సన్మానించారు. మైనార్టీలకు కాంగ్రెస్‌లో అధిక ప్రాధాన్యత ఉంటుందనటానికి అజారుద్దీన్‌కు పదవి కేటాయించడమే నిదర్శనం అని మసూద్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మైనార్టీలంతా కాంగ్రెస్ వెంటే ఉన్నారని, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు జఫీర్‌ఉద్దీన్, నాయకులు కలీల్ ఉర్ రహమాన్, అక్బర్‌అలీ, శంకర్, అజీజ్ ఉల్లాఉస్మాని, అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్‌కాలనీ పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

విత్‌ఔట్ హెల్మెట్ నో ఎంట్రీ

చిక్కడపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పీఎస్‌లోకి రావాలంటే విత్‌ఔట్ హెల్మెట్ నో ఎంట్రీ అనే నిబంధన విధించారు. ఈ మేరకు పీఎస్ గేట్‌కు స్టిక్కర్ కూడా అంటించారు. ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కలిగించేందుకు లా అండ్ ఆర్డర్ పోలీసులు నడుం బిగించారు. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించిన వాహనదారులే పీఎస్‌లోకి రావాలనే నిబంధన గట్టిగా అమలు చేస్తున్నామన్నారు.

వేంకటేశ్వరాలయంలో ఘనంగా కల్యాణం

చిక్కడపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని సుప్రసిద్ధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణవేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం ఏకాదశి తిథి కావడంతో 25మంది భక్తులు స్వామి వారి కల్యాణం చేయించారు. ఈసందర్భంగా ఆలయంలో పండుగ వాతావరణం కనిపించింది. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె. రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్మికశాఖ స్థలాన్ని కాపాడాలి

చిక్కడపల్లి : గాంధీనగర్ డివిజన్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న కార్మికశాఖకు చెందిన స్థలాన్ని కార్మికశాఖ అధికారులు కాపాడుకోవాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్‌కుమార్, మాజీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ విజ్ఞప్తి చేశారు. కార్మికశాఖకు చెందిన దాదాపు 300 గజాలకుపైగా ఉన్న స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉందన్నారు. గతంలో జవహర్ స్కూల్ నిర్వహించారని ఈ పాఠశాలను ఐదు సంవత్సరాల కిందట తరలించి వారాసిగూడలో ఏర్పాటు చేసుకున్నారన్నారు. అప్పట్నుంచి ఈ స్థలం ఖాళీగా ఉండగా ఇటీవల కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రి కట్టడాన్ని కూల్చివేశారని ఆరోపించారు. ఆ స్థలాన్ని కాజేసే యత్నం చేస్తున్నారని ఇప్పటికైనా కోట్లాది రూపాయల విలువ చేసే ఈ స్థలాన్ని కాపాడుకోవాలని వారు కార్మికశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మాలమహానాడు సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా ప్రసాద్

నల్లకుంట : మాల మహానాడు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సంకి ప్రసాద్ నియమితులయ్యారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ శనివారం మాల మహానాడు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సంకి ప్రసాద్‌ను ప్రకటించి ఆయనకు నియామక పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్.అంబేడ్కర్ కల్పించిన మాలల హక్కుల ఫలితాల కోసం కృషి చేస్తామన్నారు. సంకి ప్రసాద్ మాట్లాడుతూ తనకు పదవి కల్పించిన పబ్బతి శ్రీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : సర్వేజనా: సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలతేజం, చాచానెహ్రూ ప్రతిభా పురస్కారాల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఇ.ఎల్.ఎస్.నారాయణ మాష్టారు తెలిపారు. శనివారం హైదర్‌గూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చాచానెహ్రూ ప్రతిభా పురస్కారాలలో విద్య, మెమెరి పవర్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, సంగీతం, నృత్యం, క్రీడలు, యోగా, మిమిక్రీ మ్యాజిక్, ఏకపాత్రాభినయం, కరాటే, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ వంటి వివిధ రంగాలలో ప్రతిభావంతులైన బాలబాలికలకు బాలతేజం చాచా నెహ్రూ ప్రతిభ పురస్కారాలకు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ బాలతేజం ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారాల ఎంపికకు ఆసక్తి గల వారు ఈనెల 4వ తేదీలోపు తమ పత్రాలను అందజేయాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు ఇతర వివరాల కోసం సర్వేజనా సుఖినో భవంతు, ఇంటి నెంబర్ 1-20-164, తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్, 15 కార్యాలయానికి పంపించాలని లేదా 9652347207 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కార్తీక సమారాధన

చిక్కడపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జంటనగరాల్లో 50 సంవత్సరాలుగా బ్రాహ్మణ సమాజానికి విశేష సేవలందిస్తున్న అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ(ఏబీసీడీవో), చిక్కడపల్లి, శ్రీవిద్యా వికాస్ ట్రస్ట్(ఎస్‌వీవీటీ) ఆధ్వర్యంలో ఈనెల 9న రామాలయం పక్కనున్న నల్లకుంట కోపరేటివ్ కమ్యూనిటీహాల్‌లో విశ్వావసు నామ సంవత్సర కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏబీసీడీవో ప్రధాన కార్యదర్శి డా. ఎస్ ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. చండీ హోమం, రుద్రాభిషేకం, సత్యనారాయణస్వామి వ్రతం, మహిళలచే సామూహిక కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు విశేషంగా లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. బ్రాహ్మణ కార్తీక సమారాధన జరుగుతుందని ఆసక్తి గల అస్తిక బ్రాహ్మణ బంధువులు ఈ పూజల్లో స్వయంగా పాల్గొనవచ్చునని ఆసక్తి గల వారు 9390646539, 9100414469, 9866154760, 9492877204 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి : రాగమాధురి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో స్వరాభిషేకం శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న చిత్రగీతాలను మధురంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. అనంతరం జరిగిన సమావేశంలో గాయనీగాయకులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణా సంస్థ అధ్యక్షుడు ఏపీ పుల్లారావు, కార్యదర్శి శ్రీనివాసులు, ప్రముఖులు అఖిల, రేణుక, స్వప్న, సరయు, సౌజన్య, అనురాధ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు వట్టికోట ఆళ్వారుస్వామి

చిక్కడపల్లి : గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు వట్టికోట ఆళ్వారుస్వామి అని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. సిటీసెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలోని లైబ్రరీలో ఆళ్వారుస్వామి జయంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పద్మజ మాట్లాడుతూ ఆళ్వారుస్వామి గ్రంథాలయం ఉద్యమంతో పాటు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొని ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు అవినాశ్‌రావు, మహేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతిభారెడ్డి, సుబ్బలక్ష్మి, శ్రీకాంత్, వెంకటేష్‌యాదవ్, ముత్యం పాల్గొన్నారు.

అలరించిన తెలుగు, హిందీ చిత్రగీతాలు

చిక్కడపల్లి : కల్పన కళానికేతన్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డా. సి. నారాయణరెడ్డి యాదిలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు తెలుగు హిందీ చిత్రగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం సింగరేణి కాలరీస్ విశ్రాంత డైరెక్టర్ భూమారావుకు ఆత్మీయ సత్కారం చేశారు. ప్రసాద్, జంగయ్యగౌడ్, నాగేందర్, శ్రీనివాసరావు, మురళీమోహన్, దేవేందర్‌గౌడ్, భీంరావు, కామేశ్వరి, రమాదేవి, ఆనందలక్ష్మి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగు చెందిన ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకుకు ఓట్లు వేసి గెలిపించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. శనివారం జూబ్లీ హిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ్ డివిజన్‌లోని పోలీసు లైన్స్, వెంకటగిరి కాలనీలో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేసి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు ద్వారా బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యేగా నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి చేసిన మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతపై ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ద్వారానే నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రమోహన్ పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారం చేసి కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

జానపద ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజానాట్య మండలి రాష్ట్ర 3వ మహాసభలను పురస్కరించుకుని శనివారం నాట్యమండలి కార్యాలయంలో జానపద ఉత్సవాల పోస్టర్‌ను ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ మాదాల రవి, తిరుపతయ్యలు ఆవిష్కరించారు. 2026 జనవరి 5, 6, 7వ తేదీల్లో ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని వారన్నారు. ఈ మహాసభల్లో జానపద ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.భాస్కర్, మల్లెల రాము, ఏ.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఏనుగు నరసింహారెడ్డిని సన్మానిస్తున్న ఓలేటి పార్వతీశం, వంశీ రామరాజు

నరసింహారెడ్డికి జాతీయ సాహిత్య పురస్కారం

చిక్కడపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత కవి దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి 128వ జయంతి సందర్భంగా శనివారం రాత్రి త్యాగరాయగానసభలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డికి దేవులపల్లి వంశీ జాతీయ సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం నరసింహారెడ్డికి పురస్కారం బహూకరించి మాట్లాడుతూ రాయప్రోలు సుబ్బారావు భావకవితాయుగకర్త కాగా దేవులపల్లి ఆ కవిత్వ పరివ్యాప్తికి కృషి చేసిన మహావ్యక్తి అన్నారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ తన కవితలపై మాట్లాడడం తాను గొప్పగా భావిస్తానన్నారు. వంశీ రామరాజు, డా. తెన్నేటి సుధ, సుధామయి పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి కోసం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో నల్లకుంట డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలు కె.లక్ష్మణ్‌కుమార్, ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, ఎస్.రాంజగదీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

హైదరాబాద్ సంస్కృతి-సంస్కరణల్లో కన్నడిగులది ప్రధాన పాత్ర

- కన్నడ రాజ్యోత్సవంలో సీపీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సంస్కృతి-సంస్కరణల్లో కన్నడిగుల పాత్ర ప్రముఖమైనదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ. సజ్జనార్ పేర్కొన్నారు. కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిరలో కన్నడ రాజ్యోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సిటీ సీపీ సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి రామానందతీర్థ, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కాళోజీ నారాయణరావు, తదితర ప్రముఖులు కన్నడ ప్రాంతం వారేనని గుర్తుచేశారు. అనేక మంది హైదరాబాద్‌లో భాగమై.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేశారని వివరించారు. ఈ సందర్భంగా కన్నడిగులందరికీ కన్నడ రాజ్యోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 90ఏళ్లుగా హైదరాబాద్‌లో కర్ణాటక సాహిత్య మందిర చేస్తున్న సేవలను ప్రశంసించారు. భారత సాహిత్యంలో కన్నడ సాహిత్యానికి విశిష్ట స్థానం ఉందన్నారు. తెలుగు, కన్నడ సంస్కృతుల మధ్య బలమైన సాంస్కృతిక బంధం ఉందని పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్ నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్, కర్ణాటక సాహిత్య మందిర అధ్యక్షులు సురేంద్ర కట్గేరి, కర్ణాటక మహిళా మండలి అధ్యక్షురాలు జయలక్ష్మి కట్గేరి, కార్యదర్శి నరసింహమూర్తితో పాటు పరిమళ ముకుంద్ కులకర్ణి, ముకుంద్ కులకర్ణి, రాఘవేంద్రదేశాయ్, శ్రీకాంత్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి రాజ్యోత్సవంను ప్రారంభిస్తున్న సీపీ సజ్జనార్

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతల బ్లాక్‌మెయిల్ రాజకీయం

- బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ విమర్శించారు. శనివారం జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ముఠా జైసింహ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిస్తేనే ప్రభుత్వ పథకాలు జూబ్లీహిల్స్ ప్రజలకు అందుతాయని, బీఆర్ఎస్ గెలిస్తే పథకాలు రద్దవుతాయని కాంగ్రెస్ నేతలు పేర్కొనడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్‌లో అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, బాల్ల ప్రశాంత్, టెంట్ హౌస్ శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.


షేక్‌పేట ప్రచారంలో యువ నాయకుడు ముఠా జైసింహ, దీన్‌దయాల్‌రెడ్డి, ప్రశాంత్

భవనం పై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి

రాంనగర్ : ఓ అపార్ట్‌మెంట్ చుట్టూ పరదాలు కట్టడానికి వచ్చిన ఓ భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు 5వ అంతస్తు నుంచి పక్కన గల బిల్డింగ్‌పై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ముషీరాబాద్ పీఎస్ పరిధిలోని గాంధీనగర్‌లో శనివారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు(47) గాంధీనగర్‌లో ఓ బిల్డర్ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ చుట్టూ పరదాలు కట్టేందుకు దినసరి కూలీగా వచ్చాడు. శనివారం మధ్యాహ్నం భోజనం అనంతరం 5వ అంతస్తు వద్ద పరదాలు కడుతుండగా అదుపుతప్పి పక్కన ఉన్న బిల్డింగ్‌పై పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బిల్డర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. దీనిపై ముషీరాబాద్ పీఎస్ సీఐ జి.రాంబాబు పర్యవేక్షణలో ఎస్ఐ లింగయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యం

బర్కత్‌పుర : గుజరాత్‌లోని వడోదర వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన శంకర్ కుమార్తె మౌనిక(19) గుజరాత్‌లోని వడోదరలోని ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. సెలవుల్లో ఇంటికి వచ్చింది. అక్టోబర్ 30న వడోదర వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. ఆ విద్యార్థిని కాలేజీకి వెళ్లలేదు. దీంతో తండ్రి శంకర్ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాలాలో మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర : కృష్ణానగర్ నాలాలో మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి కొల్లూరు ప్రాంతానికి చెందిన నర్సింహ కుమారుడు యాదగిరి(31) మద్యానికి బానిసై మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రిలో అక్టోబరు 22న చేర్పించారు. శుక్రవారం ఆస్పత్రిలో ఎవరికి చెప్పకుండా యాదగిరి బయటకు వచ్చి మూసీలో పడిపోయాడు. శనివారం కృష్ణానగర్ నాలా వద్ద మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

4న కలెక్టరేట్ల ముట్టడి : వేముల రామకృష్ణ

బర్కత్‌పుర, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు 8,500 కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. శనివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్‌తో కలిసి చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థినేతలతో కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి తోపాటు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్, నిఖిల్, ప్రభాకర్, తిరుపతి, రాహుల్, ప్రీతమ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటరింగ్‌పై అవగాహన పెంపొందించుకోవాలి


రాంనగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : క్లౌడ్ కంప్యూటరింగ్‌పై నేటితరం విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని క్లౌడ్ కంప్యూటరింగ్ కాటిజాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సిస్టం అడ్మినిస్ట్రేటర్ రామిశెట్టి హర్ష సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల ఆవరణలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యం లో, సనాష్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కలిసి విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటరింగ్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన క్లౌడ్ కంప్యూటరింగ్‌కు సంబంధించిన మౌలిక అంశాలు, మైక్రోసాఫ్ట్ 365, అజూర్ సేవలను విద్యార్థులకు వివరించారు. కంప్యూటర్ రంగంలో వస్తున్న ఆధునిక అంశాలు విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకుని నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్ట, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో నవీన్‌యాదవ్‌ను గెలిపించాలి

రాంనగర్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఓటర్లందరూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓటువేసి గెలిపించాలని సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌సేన జాతీయ అధ్యక్షుడు దిడ్డి రాంబాబు కోరారు. నవీన్‌యాదవ్‌కు మద్దతుగా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌సేన జాతీయ అధ్యక్షుడు దిడ్డి రాంబాబు తన సేన సభ్యులతో కలిసి శనివారం యూసుఫ్‌గూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుడు, యువ నాయకుడు నవీన్‌యాదవ్‌కు ఓటు వేసి గెలిపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ నిధులు నియోజకవర్గానికి కేటాయిస్తారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మాటలను ప్రజలు నమ్మిమోసపోవద్దని ఆయన కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సహకరించాలి

చిక్కడపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం సహకరించాలని తెలంగాణ జనసమితి(టీజేఎస్) ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశా రు. టీజేఎస్ ఆధ్వర్యంలో శనివారం 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ నుంచి మెరుగుశ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పెద్దఎత్తున సదస్సుకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని బీసీ సోదరులు అత్యధిక సంఖ్యలో తమతోపాటు హాజరయ్యారన్నారు. గాంధీనగర్ డివిజన్ జనసమితి అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్, నగర ఉపాధ్యక్షుడు పునిరెడ్డి జయపాల్‌రెడ్డి, నాయకులు గడ్డం శంకర్, సత్యనారాయణ, కృష్ణ, మహేష్ తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.


బీసీ సదస్సులో గాంధీనగర్ డివిజన్ టీజేఎస్ నేతలు